అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని కలెక్టర్‌కు వినతి

నార్నూర్ : నార్నూర్, గాదిగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న పెండింగ్ బీటీ, సిసి రోడ్లతో పాటు వివిధ పనులను పూర్తి చేయించాలని జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు మండల నాయకులతో కలిసి బోకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినట్లు ఏఎంసి వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు సహకరించాలని విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గాదిగూడ వైస్ ఎంపిపి యోగేష్, నాయకులు శేఖర్ బాబు, పూసం ఇస్రు ఉన్నారు.



అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 16 మార్చి 2023

బీడీ వర్కర్స్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.హరిత

నవతెలంగాణ-నిర్మల్

నిజామాబాద్ జిల్లాలో 13,14 తేదీలలో రెండు రోజులుగా జరిగిన తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్వర్ణోత్సవ 9వ మహాసభలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.హరిత ఎన్నికయ్యారు. రాష్ట్రంలో బీడికార్మికుల హక్కుల కోసం ఆమె నిరంతర పోరాటాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన కోప్టా చట్టం, జీఎస్‌టీ, 4లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, పెరిగిన జీతభత్యాల అమలు కోసం, కార్మికులకు రూ.3వేల పెన్షన్, జీవనభృతి అమలు కోసం అనేక ఆందోళనలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్‌తో పాటు కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా..?

- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో భట్టి పాదయాత్ర
- పార్టీ శ్రేణులను ఏకతాటిపై తెచ్చేందుకు యత్నం
- సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా సాగనున్న యాత్ర

దేశంలో..రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు తపిస్తున్న కాంగ్రెస్ పార్టీ జనం బాటపడుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్ జోడో పేరిట పాదయాత్ర కొనసాగిస్తుండగా..ఇదే పేరిట సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సైతం పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఈ యాత్రను ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి నుంచి మొదలు పెడుతున్నారు. 13రోజుల పాటు సాగనున్న ఈ యాత్ర ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొనసాగనుంది. రోజువారీగా సాగనున్న ఈ యాత్ర వివరాలను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న ఈ తరుణంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సమాయత్తమవుతున్నారు. జిల్లాలో భట్టి విక్రమార్క యాత్ర ముగిసిన వెంటనే రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాత్ర కొనసాగేలా ప్రణాళికలు రూపొందించడం పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో అధికారం మాత్రం దూరమైంది. వరుసగా రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ పరాజయం పాలై ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని పార్టీ ఉవ్విళ్లూరుతోంది. అధికారమే లక్ష్యంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్ జోడో పేరిట రాష్ట్రంలో పాదయాత్ర చేపడుతున్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సైతం పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదలుపెట్టి నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల గుండా 39నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగేలా ప్రణాళిక రూపొందించారు. చివరగా ఖమ్మంలో భారీ బహిరంగ సభతో ఈ యాత్ర ముగిసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ యాత్ర జిల్లాలో ఇన్నాండ్లు కొంత స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏకతాటిపై రెండు వర్గాలు..!

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగిన వర్గ విభేదాలు ఈ యాత్రతో సమసిపోయేలా కనిపిస్తున్నాయి. ఇన్నాండ్లు ఉప్పునిప్పులా ఉన్న ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వర్గాలు భట్టి యాత్రతో ఏకతాటిపై వచ్చినట్లు కనిపిస్తోంది. ఇటీవల మహేశ్వర్‌రెడ్డి భైంసాలో చేపట్టిన పాదయాత్రలో ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొనడంతో వర్గ విభేదాలకు చెక్‌పడినట్లేననే పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కానీ ఇరువర్గాలకు చెందిన స్థానిక నాయకుల్లో మాత్రం ఇంకా మనస్పర్థలు తొలగిపోలేదనే తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇరువర్గాల నుంచి నాయకులు ఆసక్తి కనబర్చడం.. పార్టీ టికెట్ కోసం ఇప్పట్నుంచే ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం వంటి పరిణామాలు నాయకుల మధ్య అంతర్గత విభేదాలకు కారణమవుతోందని తెలుస్తోంది. కానీ నాయకులు మాత్రం పార్టీ శ్రేణులు విభేదాలు విడనాడి ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏప్రిల్‌లో రేవంత్ యాత్ర..?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భట్టి విక్రమార్క పాదయాత్ర 13రోజుల పాటు కొనసాగనుంది. ఇప్పటికే ఈ యాత్రకు సంబంధించిన షెడ్యూల్‌ను పార్టీ శ్రేణులు విడుదల చేశాయి. మరోపక్క ప్రస్తుతం నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో జోడో యాత్ర కొనసాగిస్తున్న పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాత్ర కూడా జిల్లాలో ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో యాత్ర ముగిసిన తర్వాత టీపీసీసీ సమావేశం ఉంటుందని ఇందులో రేవంత్‌రెడ్డి తదుపరి యాత్రకు సంబంధించి షెడ్యూల్ నిర్ణయించనున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంటుల పరిధిలోని నియోజకవర్గాలను కలిపేలా యాత్ర షెడ్యూల్ రూపొందిస్తారని దీంతో ఏప్రిల్ నెలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ రేవంత్ పాదయాత్ర చేపట్టే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.



పోటీ పరీక్షలన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



నవతెలంగాణ-నిర్మల్

పోటీ పరీక్షలన్నింటిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థి, నిరుద్యోగులు టీఎస్‌పిఎస్‌సి విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి అహర్నిశలు కష్టపడి ప్రిపేర్ అవుతుంటే పేపర్ లీకేజీ ఘటనలు చోటు చేసుకోవడం చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రభుత్వానికి తెలంగాణలోని విద్యార్థి, నిరుద్యోగుల జీవితాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే స్పందించి ఇప్పటివరకు నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలన్నింటిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పిఎస్‌సి బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. లేనిపక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో టీఎస్‌పిఎస్‌సి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, నాయకులు రమేష్, పృధ్విరాజ్, అభిరామ్, శ్రీకాంత్, శ్రావణ్, ప్రసాద్, వెంకటకృష్ణ, నరేష్, నాగరాజు, కళ్యాణ్, కాశీనాథ్, నరేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లు మొదటి గురువులు



నవతెలంగాణ-తాంసి

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు మొదటి గురువులు అంగన్వాడీ టీచర్లు అని రిసోర్స్ పర్సన్ కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మహిత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ కిషన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అట పాటలు, అనుకరణ, వినడం, స్పర్శ పరస్పర చర్య ద్వారా నేర్చుకుంటారన్నారు. పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మహిళా సాధికారత గురించి వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా నివారించాలని, అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్, సుజాత, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులు, సర్పంచ్‌పై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామ దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్న భూమిని కబ్జా చేసిన అబ్దుల్లాపూర్ విడిసి సభ్యులు, సర్పంచ్ కబ్జా చేశారని బుధవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు రైతు సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విడిసి సభ్యులపై, సర్పంచ్‌పై, చర్యలు తీసుకోవాలని, బాధిత రైతుకు భూమిని అప్పగించి న్యాయం చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు డాకూరి తిరుపతి, రైతు సమన్వయ సమితి అంబర్‌పేట గ్రామ అధ్యక్షులు కొప్పుల లచ్చన్న, బాధిత రైతు కొబ్బనోళ్ల గంగన్న ఉన్నారు.

నమ్మక ద్రోహానికి మారుపేరు జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నమ్మక ద్రోహానికి మారుపేరు ఎమ్మెల్యే జోగు రామన్న అని, ఆయన ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని తన జాగీరుగా భావిస్తున్నారని బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సేవా భవన్‌లో సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు ఐనేటి సంతోషావు కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జోగు రామన్న, రాష్ట్ర ప్రభుత్వ పాలనతీరుపై శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉష్కెం రఘుపతి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ. రమణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గొర్ల రాజు యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, కిష్టారెడ్డి, మెస్రం చిత్రు, సంతోష్‌రెడ్డి, రాజేష్, రవికిరణ్‌రెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

నిర్మల్ : వేసవి కాలం దృష్ట్యా బస్సులలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లకు డిపో మేనేజర్ ఎస్.సాయన్న మజ్జిగ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. ఎండ తీవ్రత పెరగడం వల్ల బస్సులో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరు చెవులకు గుడ్డ కట్టుకోవాలని, ఎండదెబ్బ తగలకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆన్ డ్యూటీ కంట్రోలర్లు వి.రమేష్, సిఆర్ గణేష్, రాజేందర్, శేఖర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

8న బ్యాంక్ లోక్ అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న, ముందస్తుగా ఉన్న బ్యాంకు రికవరీ కేసుల పరిష్కారం కోసం ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న బ్యాంక్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ సెక్రెటరీ క్షమాదేశ్‌పాండే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ కోర్టు సముదాయాలలో బ్యాంక్ లోక్ అదాలత్ ఉంటుందని తెలిపారు. కోర్టుల్లో కేసులు ఉన్నవారు ఈ బ్యాంకు లోకదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు..

మైనార్టీలకు ఇంటర్వ్యూలు

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ లోన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలంలోని రెండు బ్యాంకులకు సంబంధించి రెండు యూనిట్లు మంజూరు కాగా లోన్ల కోసం మొత్తం 98 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు పత్రాలు, ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎ అలీం, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బుధవారం నుండి ఏప్రిల్ నాల్గవ తేది వరకు పరీక్షలు కొనసాగనుండగా పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మొత్తం ముప్పై పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులను అందుబాటులో ఉంచారు. డిఐఈఓ రవీందర్‌కుమార్ పలు కేంద్రాలను సందర్శించారు. పరీక్షలను పరిశీలించి స్థానిక సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను, హాల్ టికెట్లను పరిశీలించి లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 30 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయగా తొలి రోజు మొదటి సంవత్సరం విద్యార్థులు జనరల్‌లో 9617 మంది హాజరు కావాల్సి ఉండగా 1269 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 1202 మంది హాజరు కావాల్సి ఉండగా 184 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10819 విద్యార్థులకు 9366 మంది హాజరై, 1453 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

నేడు రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు

గురువారం నుండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకుగాను అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 9364 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

దండేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎనిమిదిన్నరకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఇతరులు ఎవరూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించకుండా ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు మొత్తం 230 మంది విద్యార్థులకు 219 హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. నిమిషం నిబంధనతో ఇద్దరు విద్యార్థులను కళాశాల సిబ్బంది వెనక్కు పంపారు. ఎంత వేడుకున్నా వారిని లోనికి అనుమతించలేదు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని, ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయులను కూడా సెల్‌ఫోన్‌తో పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం లేదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 208 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 183 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ దుర్గం జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎస్ వెంకటేశ్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియచెప్పాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్న బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పరిష్కారమైన సమస్యలు, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అనతికాలంలోనే అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొన్నామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా సామాన్య ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తోందని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన కేంద్రం వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రైవేటు రంగలో సుమారు 17లక్షల ఉద్యోగాలు, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై అర్థవంతమైన చర్చ జరగాల్సిన అవసరముందన్న ఎమ్మెల్యే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పలువురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్, వార్డు కౌన్సిలర్ అర్చన రామ్‌కుమార్, ఎంపీపీ గంధ్రత్ రమేష్, కౌన్సిలర్లు పవన్ నాయక్, పందిరి భూమన్న, నాయకులు సాజిదోద్దీన్, రాజు, గంగారెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు నిర్వహించారు. ఓ మహిళకు గర్భసంచిలో గడ్డని ఆపరేషన్ చేసి తీశారు. సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేసిన వైద్యులు అవినాష్, అశ్విర్, నళిని, సిబ్బందిని బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది బుధవారం అభినందించారు. చాల కాలంగా ఇటువంటి శస్త్రచికిత్సలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నామని, ప్రజలు సేవలు వినియోగించుకోవాలని వీరు కోరారు.

రంజాన్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో రంజాన్ పండుగ ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, నాయకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా సానిటేషన్ పనులు చేయాలని, తాగు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. వీధిదీపాలు వెలిగేలా, మసీదుల వద్ద లైటింగ్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సోఫీనగర్, వైఎస్ఆర్ నగర్, శాంతినగర్ లలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సానిటేషన్ ఎప్పటికప్పుడు చేపడుతుండాలన్నారు. డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. నైట్ మార్కెట్లు, పండ్లు, కూరగాయల మార్కెట్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపవాస దీక్షలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ లోకేష్, ఆర్‌డీఓ స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్ చందర్, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంఐఎం నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ముధోల్

ప్రజల సంక్షేమ మేతెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆడబిడ్డల పెండ్లి కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండటానికి ఈ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ముధోల్‌లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. 38మంది లబ్దిదారులకు షాదీముబారక్, ఆరుగురికి కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పెండింగులో ఉన్న చెక్కులను సైతం త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్, ఎంపీపీ అయిషా అఫ్రోజ్ ఖాన్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, ముధోల్ సర్పంచ్ వెంకటపూర్ రాజేందర్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్, టిఆర్ఎస్ మండల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రోళ్ల రమేష్, గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆర్ఐ అభిమన్యు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ - బెజ్జూర్

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇతరుల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌పీ కె సురేష్‌కుమార్ ఆదేశానుసారం మండలంలోని వివిధ గ్రామాల్లో జమ చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో బస్టాండ్ ఏరియాలో అనుమానాస్పదంగా వెళ్తున్న మినీ ఐచర్ వ్యానును ఆపి తనిఖీ చేశారు. అందులోని 45 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న అబ్బాస్‌ఖాన్, ఫరూఖ్ ఖాన్, ఎండీ నయీం, ఖాజా మొహినొద్దీన్‌ను విచారించారు. 45 క్వింటాళ్ల(90 బ్యాగులు) బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను, మినీ ఐచర్ వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. తనిఖీలో ఎస్ఐ సందీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో దగాపడ్డ నిరుద్యోగులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ పాలనలో టిఎస్‌పిఎస్సి నిర్వాకంతో తెలంగాణలో నిరుద్యోగులు దగా పడ్డారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ ఆరోపించారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను నిండా ముంచుతూ టీఎస్‌పీఎస్సీ ఉద్యోగుల చేష్టలతో పేపర్ లీక్ అయిందన్నారు. పేపర్ లీక్ గురించి ప్రశ్నిస్తే తమ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని, ఇది ప్రజాస్వామ్య లేక దొరల పాలనా అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. బోర్డు ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన పరీక్షలపై కూడా పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు ఈదులవాడ గణేష్, నాయకులు లోనారే వినోద్, వికాస్, బాపూజీ,కిరణ్, దుర్గాజి, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-బోథ్

వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల లీగల్ సర్వీసెస్ ఆథారీటి ఆధ్వర్యంలో బోథ్ మండల కేంద్రంలోని షాదిఖానాలో వ్యాపారస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతితిగా పాల్గొని, బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి తెలుపుతూ వస్తువుల నాణ్యతను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వినియోగదారుల ఫోరాన్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం జడ్జికి, వ్యాపారస్తుల సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కూమార్, వార్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యూడైస్ మదింపు పకడ్బందీగా చేపట్టాలి : డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



యూడైస్ మదింపు ప్రక్రియ పకడ్బందీగా చేయాలని మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్పీలకు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత సూచించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో యూడైస్ వర్క్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. మన ఊరు మన బడి పథకం అమలులోకి వచ్చాక యూడైస్‌కు మరింత ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. ఏలాంటి తప్పులు జరుగకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట డైట్ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ కిరణ్, సమగ్ర శిక్ష ప్లానింగ్ సెక్టోరల్ అధికారి జే నారాయణ, స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ సూరజ్, జిల్లా సమగ్ర శిక్ష టెక్నికల్ పర్సన్ సలీమ్ ఉన్నారు.

కాన్షీరామ్ కలలు కన్న రాజ్యాన్ని సాధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

మాన్యశ్రీ కాన్షిరామ్ కలలు కన్న రాజ్యాన్ని సాధించాలని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో మాన్యశ్రీ కాన్షిరామ్ 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కాన్షిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత అగ్రకుల రాజకీయాల్లో పెను మార్పులు వచ్చాయని అన్నారు. అగ్రకుల రాజకీయాలను పెట్టుబడి దారీ విధానాలను ఎండ గట్టి పేదల రాజ్యాన్ని నిర్మించిన గొప్ప నాయకుడని కొనియాడారు. తెలంగాణలో బీసీ ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజ్య స్థాపన కోసం జరిగే ఉద్యమంలో అణగారిన జాతులు తమతో ఉద్యమంలో కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు పవన్, కరాడి గంగన్న, నవీన్, రవి, సంతోష్, రాజీవ్, రమేష్, ఒమన్నా, అనిల్, శ్రీకాంత్, ప్రశాంత్, సురేష్, వినుకుమార్, అడెల్లు, తిరుపతి, నర్సింగ్, మహిళా నాయకురాలు మంజూష, శ్రీవాణి, సుస్మిత పాల్గొన్నారు.

పిప్రిలో కంటి వెలుగు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండలంలోని పిప్రి గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ అల్లూరి కవిత బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సంధ్బంగా మండల వైద్యాధికారి డాక్టర్ బీంరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు గ్రామపంచాయతీ కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షలు చేసిన తర్వాత కంటి సమస్యలు ఉన్నవారికి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆనంతరం గ్రామంలోని 176 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పండుగ మురళీమోహన్, జిల్లా రైతుబంధు సమితి డైరెక్టర్ అల్లూరి నర్సారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రామగిరి లక్ష్మి, పిప్రి వైద్యులు పండుగ ప్రశాంత్, గ్రామస్తులు రఘన్, వైద్య సిబ్బంది రమేష్, శంకర్ పాల్గొన్నారు.

ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకే కవాతు

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్



ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ నారాయణ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుండి పోలీస్ కవాతును ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. 99వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ శ్రీకాంత్ పర్యవేక్షణలో 77మంది వివిధ హోదాల్లో ఉన్న బెటాలియన్ సిబ్బందితో ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులు దగ్గర అవడానికి, ప్రజాసమస్యలు తక్షణమే పోలీసుల దృష్టికి ప్రజలు తీసుకువచ్చే విధంగా అవగాహనపర్చడమే ఈ కవాతు ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి మొదలైన కవాతు తెలంగాణ తల్లి చౌక్, ఎన్టీఆర్ చౌరస్తా, రాజీవ్ గాంధీచౌక్‌ల మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ చేరుకుంది. ఈ కవాతులో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు రజనీకాంత్, రాజు, ప్రభాకర్‌రెడ్డిలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరులో జాప్యం వద్దు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ గ్రామపంచాయతీ సెక్రటరీలతో తమ గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యల గురించి చర్చించారు. ప్రభుత్వం పథకాల అమలు తీరులో ఎలాంటి జాప్యం చేయవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నర్సరీలలో మొక్కల పెంపకం, తడి, పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డులకు తరలింపు గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీల ప్రోత్సహం గురించి వైద్య అధికారులతో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్స్ గురించి, తెలుసుకుని ఇకపై విద్యార్థులు బడి మానివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాలలో ఎంతమేరకు ఋణాలు పొందుతున్నారో తెలుసుకొని మహిళల స్థితిగతులు మెరుగుపడేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగపర్చుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కస్తుర్బా పాఠశాలను సందర్శించి భోజన సదుపాయాలు, నిర్వాహన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు తెలుసుకుని అనంతరం అధికారులకు పలు సూచనలు చేసి, సలహాలు ఇచ్చారు. అనంతరం చాక్‌పల్లి గ్రామంలో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, నర్సాపూర్ సర్పంచ్ అరుగుమీది రాంరెడ్డి, గొల్లమాడ సర్పంచ్ చెన్న మహేష్, చాక్‌పల్లి సర్పంచ్ నస్రీన్ బేగం, ఎంపీడీఓ వనజ, సీడీపీఓ నాగమణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెండ్లిలకు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్ బుకింగ్‌పై రాయితీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికులకు చేరువయ్యేందుకు టీఎస్‌ఆర్టీసీ పలు కార్యక్రమాలు, చేపడుతూ చర్యలు తీసుకుంటుంది. తాజాగా పెండ్లిలకు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్ బుకింగ్‌పై 10శాతం రాయితీ కల్పించింది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కే.కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు బుకింగ్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ వివిధ సేవలను అందిస్తోందని అన్నారు.

మహిళ సంఘాల ఆర్థిక ప్రగతిని పెంపొందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదవర్గాల వారికీ, మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకులు వివిధ పథకాల కింద రుణాలు అందించి వారి ఆర్థిక ప్రగతిని పెంపొందించే దిశగా సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల కింద ఎంపిక చేయబడిన లబ్దిదారులకు బ్యాంకులు రుణాలు అందించాలని అన్నారు. యూనిట్ల గ్రౌండింగ్‌కు సహకరించాలని అన్నారు. పేద వర్గాల ఆర్థిక అభ్యున్నతికి బ్యాంకులు ఇతోధికంగా సహకరించాలని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం జిల్లా ప్రగతికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలను సాధిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో ఇరవై శాతం ఆర్థిక రుణాలు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలనీ అన్నారు. వ్యవసాయ, అనుబంధ, విద్యా, బ్యాంకు లింకేజి, వివిధ పథకాల కింద లబ్దిదారులకు సబ్సిడీతో కూడిన మంజూరైన యూనిట్లకు బ్యాంకర్లు రుణాలు అందించాలని స్పష్టం చేశారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందిస్తున్న రుణాలను సకాలంలో మంజూరు చేయాలనీ అన్నారు. ఆయా శాఖల అధికారులు బ్యాంకర్లను సంప్రదించి రుణాల మంజూరు, యూనిట్ల గ్రౌండింగ్ చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్యాంకర్ల సహకరించనట్లైతే జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి సహకారం తీసుకోవాలని అన్నారు. సబ్సిడీతో కూడిన యూనిట్లు ప్రభుత్వం లబ్దిదారులను ఎంపిక చేసినప్పటికీ బ్యాంకులు పలు కారణాల వలన రుణాలు మంజూరు చేయడం లేదని పలువురు సంక్షేమ శాఖల అధికారులు సమావేశంలో వివరించారు. ఉన్నత విద్యాభ్యాసానికి విద్యార్థులకు విద్యా రుణాలను మంజూరు చేయాలనీ అన్నారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరంలో పాసైన విద్యార్థులకు వారి అభిష్టం మేరకు ఇంజినీరింగ్ విద్యాభ్యాసానికి అవసరమైన కోచింగ్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ఇంజనీరింగ్, ఇతర కోర్సులలో విద్యను అభ్యసించడానికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలనీ పేర్కొన్నారు. జిల్లాలో మాంసా, వివిధ ఉత్పత్తులను తయారు చేయడానికి పౌల్ట్రీ, డైరీ వంటి యూనిట్లను స్థాపించి రానున్న సంవత్సరాలలో ఎగుమతి చేసే జిల్లాగా తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీలు మంజూరు అయినప్పటికీ లబ్దిదారులకు రుణాలు అందించడం లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 222 మంది లబ్దిదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగులకు సామాజిక బాధ్యతతో రుణాలు మంజూరు చేయాలనీ అన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పథకం కింద వికలాంగులకు ప్రభుత్వం రుణాలు అందిస్తున్నదని వారికీ అవసరమైన శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కే.భాను ప్రసాద్ మాట్లాడుతూ, వ్యవసాయ పంట రుణాలు, అనుబంధ రుణాలు, ప్రభుత్వ పథకాల యూనిట్ల గ్రౌండింగ్, విద్యా, తదితర రుణాలు ఆయా బ్యాంకు బ్రాంచీలకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని అన్నారు. నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ, గోడౌన్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, మినీ రైస్ మిల్, దాల్ మిల్, పౌల్ట్రీ, డైరీ యూనిట్ల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం పథకాల కింద ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్బీఐ ఎల్‌డీఓ అక్కల్ బోరే, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ కే.శ్రీధర్ రెడ్డి, డీఆర్డీఓ కిషన్, సంక్షేమ శాఖల అధికారులు శంకర్, రాజలింగం, కృష్ణవేణి, మిల్కా, ఆయా బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జంతు సంరక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



జంతు సంరక్షణ కోసం పట్టణంలోని బంగారుగూడ డంప్ యార్డ్‌లో రూ. 2 కోట్ల 88 లక్షల వ్యయంతో జంతు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్న మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా అనేక కార్యక్రమాలను రూపొందిస్తుందని, పేర్కొన్నారు. జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు వర్మి కంపోస్ట్ షెడ్, సానిటేషన్ రిసోర్స్ పార్క్, హై టెన్షన్ పవర్ సప్లై విద్యుత్ లైన్, అంతర్గత రహదారులు తదితర నిర్మాణాలను బుధవారం మున్సిపల్ చైర్మెన్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. వాటి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. జంతువుల సంరక్షణ కోసం అందుబాటులో ఉంచిన వసతులను ఎమ్మెల్యే పరిశీలించారు. డ్రై రిసోర్స్ సెంటర్, వర్మి కంపోస్ట్ షెడ్ నిర్మాణాలను పరిశీలించి అధికారుల నుండి పలు వివరాలు సేకరించారు. మానవ వ్యర్థాల నుండి ఎరువుల ఉత్పత్తి వంటి అంశాలను అడిగి తెలుసుకున్న ఆయన సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం శునకాలకు యాంటి రేబిస్ టీకాలను వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చూడుతోందని అన్నారు. వీధి కుక్కల వల్ల ఎదురవుతున్న సమస్యలు సైతం పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి అంశాలను గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ రౌత్ మనోహర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, ఫ్లోర్‌లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ వెంకన్న, నాయకులు రామ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- సీసీ టీవీ కెమెరాలు తప్పనిసరి
- ఆదిలాబాద్ ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఇచ్చోడ

హైవేలపై దాబాలలో అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే దాబా యజమానులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబా ఓనర్స్‌తో ప్రత్యేక సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో హైవే దాబాలలో మద్యం తాగడం, వ్యభిచారం ప్రోత్సహించడం, ఇతర రాష్ట్రాల దొంగలతో కుమ్మక్కైన పనివారిని ఏర్పాటు చేసుకోవడం లాంటి అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైవేలపై ఉన్న ధాబాలలో సరైన పార్కింగ్ ఏరియాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధాబా ఏరియా మొత్తం సీసీటీవీ కెమెరాల పరిధిలో వచ్చే విధంగా 30 రోజుల బ్యాకప్‌తో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దాబాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న వాహనాలలో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తుల వివరాలను వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియ జేయాలన్నారు. ప్రస్తుతం వైద్యశాఖ వివరాల ప్రకారం దాబాలు నిర్వహిస్తున్న గ్రామాల పరిధిలో వ్యభిచారం నిర్వహించడం వల్ల హెచ్ఐవీ కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. దాబాలో దొంగతనాలు నిర్వహించే ముఠా జాడ తెలిసినప్పుడు వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. దొంగలకు సహకరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సన్మార్గంలో దాబాలను నిర్వహించడం వల్ల ఎక్కువగా ప్రజలు ఆకర్షితులై వ్యాపారంలో లాభాలను ఆర్జించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఇచ్చోడ సీఐ ఎం నైలు, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, నీరేష్, శ్రీకాంత్, దాబాల యజమానులు పాల్గొన్నారు.

30 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం

- సీసీఎఫ్ శరవన్
- జిల్లా వ్యాప్తంగా 12 చెక్ డ్యామ్‌ల నిర్మాణం
- కంపా నిధులతో నర్సరీల పెంపకం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



హరిత హారంలో భాగంగా చెట్లను పెంచడానికి అటవీశాఖ ద్వారా జిల్లాలో మొత్తం 30 లక్షల మొక్కలను పెంచడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని ఆశాఖ సీసీఎఫ్ శరవన్ పేర్కొన్నారు. బుధవారం నాడు ఆయన మండలంలోని అటవీ రేంజ్ కార్యాలయం ఆవరణలో పెంచుతున్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. ఔషధ గుణాలున్న ఆశ్వగంద, ఉసిరి, అలోవెర, తదితర ప్రత్యేక మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మండల అటవీ రేంజ్‌లో కంపా నిధుల ద్వారా మొత్తం లక్ష మొక్కలను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దీంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా సైతం వివిధ రకాల మొక్కలను నర్సరీలో పెంచుతున్నట్లు వెల్లడించారు. వన్నె ప్రాణుల దాహార్తిని తీర్చడానికి రూ. 5.5 లక్షలతో చేపట్టే చెక్ డ్యామ్‌ల నిర్మాణం ఇకనుంచి టెండర్ ద్వారా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దానితో పాటు ఎన్‌హెచ్ 44 రోడ్డుకు ఇరువైపులా నాటిన ఏవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించామని పేర్కొన్నారు. ఎక్కువగా పెరిగిన మొక్కల బెడ్లను వేరే ప్రాంతానికి తరలించాలని సిబ్బందికి సూచించారు. అటవీ శాఖ ద్వారా నిర్మించిన క్వార్టర్లు పరిశీలించారు. ఆయన వెంట డీఎఫ్ఓ రాజశేఖర్, స్థానిక ఎఫ్ఆర్ఓ శీలానంద్, ఎఫ్ఎస్ఓలు గంగారాం, నర్సయ్య, బీట్ అధికారిని జ్యోష్ణ ఉన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో బుధవారం డీఆర్డీఓ విజయలక్ష్మి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పల్లెప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మొక్కల సంరక్షణ గురించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీడీ ఓస ప్రసాద్, ఏపీఓ దివ్య, టీఏ దినేష్, నారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్వరంతో బాలిక మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హనుమాన్ గల్లీకి చెందిన బాలిక గుల్వే నిషా(8) జ్వరంతో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మృతురాలు స్థానిక పబ్లిక్ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. మంగళవారం నాడు ఆకస్మాత్తుగా జ్వరం తీవ్రంగా రావడంతో చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించిందని తెలిపారు.

నాయక్‌పోడ్ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని భీమన్న అలయం వద్ద మండల నాయక్ పోడ్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జిల్లా అధ్యక్షులు పొతిండ్ల శంకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా గంగారాం, అధ్యక్షులుగా రాజుల రవి ఉపాధ్యక్షులుగా మైండ్ల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా తోట మల్లేష్, కార్యదర్శులుగా దత్తు, పాకాల రాజు, ఏరిండ్ల చిన్నయ్య, ఎర్రం గంగన్న, రాజుల పిరాజీలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శిలు అందరికి అందుబాటులో ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

విద్యార్థులందరికీ రాగిజావా పంపిణీ చేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు పి.నాగేందర్ తెలిపారు. బుధవారం మావల మండలంలోని వాఘాపూర్ జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులందరూ ఉదయం 7.45లకే పాఠశాలకు హాజరవుతున్నారని, దీని కారణంగా శ్రీ సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ పెద్ద మనసుతో విద్యార్థులకు12.30 భోజనం చేయకుండా ఉంటారనే ఉద్దేశంతో ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకి రాగిజావ అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆరోగ్యం దృష్ట్యా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ రమేష్ బాబు పిల్లల కోసం దోసకాయలు, సబ్జాలు, సైంధవ లవణం వేసి రుచిగా తయారు చేసి అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యా కమిటీ చైర్మెన్ గోపాల్, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ప్రతాప్, శ్రీనివాస్ వర్మ, ఖయ్యూం, రవీందర్, విద్యార్థినీ విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల కెరీర్‌పై అవగాహన

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అజ్మీరా ప్రత్యూష ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల అధ్యాపకులు మారుతీ శర్మ పాఠశాలలో హాజరై పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవడం ఎలా, కెరీయర్ గైడెన్స్ గురించి, బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల్లో ఉన్న సందేహాలను తొలగిస్తూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే విధంగా విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పదో తరగతి అనంతరం ఎలాంటి కోర్సులను ఎంచుకోవాలి, వాటిపై అవగాహన కల్పించారు. ఆనంతరం ఎంపీడీఓ రాధా రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ప్రణాళిక బద్ధంతో సన్నద్ధమై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. పాఠశాలకు వచ్చి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించిన, మారుతి శర్మకు పాఠశాల తరపున ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, మండల పరిషత్ సూపరింటెండెంట్ పుష్ప, రిటైర్డ్ అధ్యాపకులు శంకర్ పాల్గొన్నారు.

'పోటీ పరీక్షల్లో పారదర్శకత లోపించింది'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్పీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో పారదర్శకత లోపించిందని ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి ఆరోపించారు. టీఎస్పీఎస్సీ ఘటనను ఖండిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయ ఆవరణలో అభ్యర్థులతో కలిసి నిరసన తెలిపారు. టీఎస్పీఎస్సీ, ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగులకు జాబ్ నోటిఫికేషన్ పడటమే తప్ప ఉద్యోగాల భర్తీ జరగడం లేదని అన్నారు. రాజకీయ నిరుద్యోగుల కోసం తెచ్చుకున్నట్టుగా ఉందని, ఇటు లీకేజీ వ్యవహారం వల్ల నిరుద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లీకేజికి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పీచర గ్రామంలో బుధవారం శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కొలహలంగా మారాయి. డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్ రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, మండల బీఆర్ ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, రాచపూర్ సర్పంచ్ గంగారాం, ఎంపీటీసీ భూసి ముత్యం, రాష్ట్ర ముదిరాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి సోప్పెర శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు పిట్ల నాగేష్, ఆలయ కమిటీ చైర్మెన్ గుర్రం బోర్రన్న, సభ్యులు గుర్రం చిన్నయ్య, ఊద్త ఆశన్న, బొజ్జ కమలాధర్, పాతర్ల వెంకటరమణ, ముత్యం, బొమ్మరిని శ్రీకాంత్ పాల్గొన్నారు.

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ కరపత్రం విడుదల

జన్నారం : ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీని ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు మగ్గిడి జయ తెలిపారు. బుధవారం మండలంలోని పొన్కల్ సుందరయ్యనగర్ కాలనీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఎనిమిది ఏండ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణం విరమించాలని, అఖిల భారత సంఘాల పిలుపులో భాగంగా రాష్ట్రంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామ స్థాయి నుండి మండల, జిల్లా కేంద్రాల వరకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతు పద్మ, రాపాల శంకరవ్వ, మేకల శారద, సత్యవ్వ, గంగామణి పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చర్యలు

నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీ అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ ఓ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా కన్వెర్షన్ లేని భూముల్లోని ప్లాట్ కొనుగోలు చేసి కొనుగోలు చేసి అనుమతి లేని నిర్మాణాలు చేపట్టినట్లయితే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వెంచర్ల సుఏర్పాటు చేయదలు చుకుంటే తప్పనిసరిగా గ్రామపంచాయతీ అనుమతి పొందాలని సూచించారు. అనుమతిలేని వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు కొనుగోలు చేయరాదని తెలిపారు. ఇప్పటికే గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసినందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు పోలీసుల సహకారం కోరనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటి నెంబర్లను కేటాయించే విషయంలో నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తి కావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు పూర్తి కావాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో మన ఊరు-మనబడి పనులపై అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి సంబందిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులకు సంబంధించిన ఎంబీ రికార్డు తయారు చేసి సమర్పించాలన్నారు. పనులపై నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గుర్తించిన పనులలో ఉన్న టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి అశోక్, డీఆర్డీఓ సురేందర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-వేమనపల్లి

మండలములోని నీల్వాయి క్యాతనపల్లి గ్రామ పంచాయతిలలో ఉపాధి హామీలో జరుగుతున్న చిన్న నీటి కుంట పూడిక తీత పనులను ఏపీఓ సత్య ప్రసాద్ పరిశీలించి మస్టర్ సరి చూశారు. కూలీలు అందరు ఆధార్ కార్డులు అప్డేట్ చేసుకోవాలి అని తగు సూచనలు చేసారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాఫర్ క్షేత్ర సహాయకులు తారబాయి, కిషన్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం చుట్టూ కంచె వేయాలి

నవతెలంగాణ-నస్పూర్

అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం చుట్టూ కంచె వేసి, విగ్రహానికి రంగులు వేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసని వెంకటరమణ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొనుటకు ఏప్రిల్ మొదటి వారంలో పనులు పూర్తి చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోషిక మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులు సిరిమల్లె రత్నం, నందయ్య సలహాదారులు పానుగంటి అరుణ్ కుమార్, ధోనుపల్లి లింగయ్య పాల్గొన్నారు

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయింపు

నవతెలంగాణ-వేమనపల్లి

వేమనపల్లి శివారులోని సర్వే నెంబర్ 6 లోని 1.00 ఎకరం ప్రభుత్వ భూమిని సబ్ స్టేషన్ కోసం కేటాయించినట్లు తహసీల్దార్ రాజ్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన ధ్రువ పత్రాలను బుధవారం సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్‌కు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుబిడే మధుకర్ పాల్గొన్నారు.

జన్నారం టింబర్ డిపోలో కలపవేలం

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ కార్యాలయం టింబర్ డీపోలో బుధవారం ఎఫ్డీఓ మాధవరావు ఆధ్వర్యంలో కలపవేళం పాట నిర్వహించారు. ఈ వేళంలో 21 లాట్లు,7.038, సెంటీమీటర్ల కలప వేళం వేసినట్టు ఆయన తెలిపారు. అందుకుగాను రూ.3,74,900 ఆదాయం వచ్చిందని తెలిపారు. కలప అవసరం ఉన్నవారు ఈ నెల 23వ తేదీలో కూడా టింబర్ వేళంలో పాల్గొని కల్పన దక్కించుకోవచ్చని సూచించారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు

నవతెలంగాణ-కెరమెరి

సుర్ధపూర్ నుంచి ధనోర గ్రామం వరకు ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఇటీవల తరుచు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజలు రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ధనోర గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సయ్యద్ రిజ్వా న్ ఉదారతను చాటుకున్నారు. రోడ్డు పొడవునా ఏర్పడిన గుంతలను పూడ్చి వేయుటకు తన స్వంత వాహనాలు ఉపయోగించి సమీపంలోని మొరం మట్టిని వేయించారు. గతంలోను ఇదే రోడ్డుకు పలుమార్లు మొరం మట్టితో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న వయసులోనే సేవా భావాన్ని కలిగి ఉండడం పట్ల ఉప సర్పంచ్ రిజ్వా న్‌ను సమీప గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.

కుమురంభీంకు డీఎఫ్ఓ నివాళి



నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ సందర్శించిన నూతన డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రే వాల్ గిరిజన వీరుడు కుంరంభీంకు ఘన నివాళ్ల అర్పించి భీం సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధి కోసం, సమస్యల పట్ల పోరాటం సాగించిన గొప్ప వీరుడని తెలిపారు. గిరిజనుల హక్కుల కోసం చేసిన చేసిన పోరాటంలో జోడేఘాట్‌లోనే అసువులు బాసినట్లు పేర్కొన్నారు. అనంతరం జోడేఘాట్ అటవీ పరిధిలోని అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎఫ్డీఓ విజయ్ కుమార్, ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

చెన్నూర్ మరింత అభివృద్ధి చెందుతుంది

- కాంగ్రెస్‌కు కాలం చెల్లింది
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు
- రూ.210 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం రాబోలు కాలంలో మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. చెన్నూర్ నియోజకవర్గ పర్యటలో భాగంగా బుధవారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణాలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాలు చేస్తూ పోతుంటే బీజేపీ ప్రభుత్వం కండ్లు మండి కూల్చే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల సంక్షేమ కోరి పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రజలను నమ్ముతుందని, అదే బీజేపీ పార్టీ ఈడీలను నమ్ముతోందని ఎద్దేవ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని, ఆ పార్టీ కనుమరుగైపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు అడుగాల్సిన పని లేకుండా ప్రజల అవసరాలను గుర్తించి తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ కన్పించవని అన్నారు. అడుగకుండానే ఆసర పింఛన్లు, కళ్యాణ లక్ష్మీ, రైతు బందు, రైతు భీమా తదితర పథకాలు అమలు చేస్తున్న తెలంగాణలో శ్రీరామ నవమి తర్వాత గర్భిణీలకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే గృహ లక్ష్మి పథకం అమలులోకి వస్తుందని క్యాబినేట్‌లో ఆమోదం పడిందని తెలిపారు. పేద ప్రజల కోసం పని చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం మీద బీజేపీ బురుదజల్లే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.



అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ సంపద పెంచుకుంటు పేదలకు పంచుకుంటూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పుకొచ్చారు. గతంలో ఇక్కడి నుంచి గెలిచిన వారు ఎవ్వరు తీసుకురానన్ని నిధులు తీసుకొచ్చి ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న సుమన్‌కు వచ్చే ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాతి గర్వపడేలా కేసీఆర్ పాలన కొనసాగుతోందని ప్రపంచం అబ్బురపడేలా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించుకున్నామని తెలిపారు.

అభివృద్ధికి చిరునామగా మారింది

అప్పుడు ఉన్న చెన్నూరుకు ఇప్పుడు ఉన్న చెన్నూరుకు ఎంతో తేడా.. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన నాయకులు 50 ఏండ్లు ప్రభుత్వంలో పని చేశారని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఏమాత్రం కృషి చేయని నాయకులు ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడైన చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కార్యదీక్ష, పట్టుదల, కృషి ఫలితంగా చెన్నూర్ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందని వివరించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, తునికాకు బోనస్ చెక్కులు, అభయహస్తం చెక్కులు పంపిణీ చేశారు.

సుమన్ కృషి అడుగడుగు కన్పిస్తోంది : ఎమ్మెల్సీ దేశపతి నివాస్

చెన్నూర్ పట్టణంతో పాటు గ్రామాల్లో కన్పిస్తున్న అభివృద్ధి స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కృషి ఫలితంగానే అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. ఉద్యమ సమయంలో ఈ ప్రాంతంలో తిరిగిన సంధర్భాలు అప్పుడున్న పరిస్థితులు ప్రధానంగా రహదారుల ఇబ్బందులు గుర్తు చేస్తూ ఇప్పుడు జరిగిన అభివృద్ధి చూస్తే ఇది చెన్నూరేనా .. అని అనుకోవల్సి వచ్చిందని అన్నారు. ఈ సంధర్భంగా వాణమామలై వరదాచార్యుల గురించి తనకు తెల్సిన కొన్నింటిని సభ ముందు ఉంచిన ఆయన విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనడం నాకు ఎంతగానో ఆనందంగా ఉందన్నారు.

అభివృద్ధికి సహకరిస్తే స్వాగతిస్తా... చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తే శాలువాలతో సన్మానించి స్వాగతిస్తామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ గడ్డం వివేక్‌ను పరోక్షంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించిన నాయకులు అధికారంలో ఉన్నన్ని రోజులు అభివృద్ధికి పాటుపడకుండా నాయకులు ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ సారధ్యంలో తెలంగాణ రాష్ట్రాని సుభిక్షంగా అభివృద్ధి చేసుకుంటుంటే కేంద్రంలోని బీజేపీ తెలంగాణ ప్రజా ప్రతినిధులపై ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తోందని విమర్శించారు.

గూడెం లిఫ్ట్ పైపులు మారుస్తామని మంత్రి హామీ



లక్షెట్టిపేట్ : మాది రైతు ప్రభుత్వమని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీర్ హరీష్ రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లక్షెట్టిపేట్‌లో రూ.8.50 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నమన్నారు. మంచిర్యాల జిల్లాతో పాటు మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. అంతేకాకుండా గూడెం లిఫ్ట్ మరమ్మత్తులు జరుగుతున్న నేపథ్యంలో నూతన పైపులు వేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివద్దిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ అభివద్ధి చేస్తున్న ప్రభుత్వంను ప్రజల ఆశీర్వాదాలు ఉండాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు రైతులకు చేసిందేమిటని ఏద్దేవా చేశారు. అంతకుముందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 5 వేల మంది ప్రజలు సమావేశానికి హాజయ్యారు. కార్యక్రమంలో మంచిర్యాల కలెక్టర్ సంతోష్ నాయక్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చిన్నయ్య, నడిపల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్ బాబు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీలు మంగ, గడ్డం శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్‌లు ప్రభాకర్, శ్వేత పాల్గొన్నారు.

పభుత్వపరంగా సహకారం ఉంటుంది



చెన్నూర్ నియోజవర్గం అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న సుమన్‌కు ప్రభుత్వ పరంగా సహాయ సహకారం ఎప్పుడు ఉంటుందని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంత్రి హరీష్‌రావుతో కలిసి చెన్నూరులో పర్యటించిన ఆయన ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. చెన్నూర్‌లో ఎంతో మార్పు కన్పిస్తోందని ఇదంతా ఇక్కడి ఎమ్మెల్యే కృషి ఫలితమే అన్నారు. రూ. 18 కోట్లు తునికాకు బోనస్‌గా చెన్నూర్ నియోజకవర్గం ప్రజలకు అందుతోందని, బోనస్ మొత్తం కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

భీమారం : మండల కేంద్రంలోని జాతీయ రహదారి పొడవున నూతనంగా ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మాట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్‌ఫాం నర్సరీని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చెన్నూర్ ప్రాంత అభివృద్ధిపై స్థానిక శసన సభ్యులు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. భీమారం మండల కేంద్రంగా ఎప్పుడో ఏర్పడాల్సి ఉండగా అది వెనక పడిందని, ఇక్కడి ప్రజల చిరకాల కోరికని తెలుసుకున్న సుమన్ కేవలం 9 గ్రామాలతో మండల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణుకంట్ల ప్రవీణ్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జడ్పీటీసీ భుక్య తిరుమల, స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులుపొడేటి రవి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు వేముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి

నవతెలంగాణ-మంచిర్యాల



టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించి, నిందితులపై చర్యలుతీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవరించిన చైర్మెన్, కార్యదర్శిని తొలగించాలని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎంవీఎన్ కళాశాల నుంచి ఐబీ చౌరస్తా వరకు ప్లకార్డ్స్‌తో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని, భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గ్రూపు- పరీక్ష కూడా లీకైనట్లుగా వార్తలు వస్తున్నాయని, తెలంగాణ ఎర్పడిన నుంచి నియామకాలు లేక ఏన్నో యేండ్లుగా ఉద్యోగాల కోసం ఏదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులు ఈలాంటి చర్యలతో నష్టపోతున్నారని తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి విలువైన సమయం కేటాయించి లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నారని, బోర్డులో ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన బోర్డు చైర్మన్ బి.జనార్ధన్‌రెడ్డి, బోర్డు కార్యదర్శి పాత్రపైనా, సభ్యుల పాత్రపైనా విచారణ జరిపించాలనీ అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి చైర్మన్‌ను తొలగించి వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు బోర్డులో ఉన్న వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్, మండల నాయకుడు రాకేష్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : పేపర్ లీక్ విషయంలో టీఎస్ పీఎస్సీ చర్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పట్టణ కేంద్రాలకు వెళ్లి రూ.లక్షలు కోచింగ్ సెంటర్లో ధారపోసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు.

సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బోర్కుటె శ్యాంరావ్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టీకానంద్ పాల్గొన్నారు.

కెరమెరి : టీఎస్ పీఎస్సీ పరీక్షల లీకేజీ వెనుక సర్కారు పెద్దల హస్తంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. టీఎస్పీఎస్సీ పరీక్షలు సక్రమంగా నిర్వహించకుండా పేపర్లు అమ్ముకొని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చే కుట్రలను నిరుద్యోగ లోకం తిప్పికొట్టాలన్నారు. నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్ పీఎస్సీ కమిషన్ సర్కారు తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. బీఆర్ఎస్ పాలనలో లీకేజీ, ప్యాకేజీల పేరుతో నిరుద్యోగుల జీవితాలతో చేలాగతమాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల అధ్యక్షులు రాజేశ్వర్, ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, నితిన్, జిల్లా నాయకులు జగజంపుల సుమన్ పాల్గొన్నారు.

కార్యాలయ సంబంధిత సమస్యలు పరిష్కరించాలి


నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి సంస్థలో పనిచేయుచున్న కార్యాలయ సిబ్బంది ఇబ్బంది పడుతున్న వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గోదారి భాగ్యరాజు అధ్యక్షతన ఆర్కే న్యూ టెక్ గని మేనేజర్ స్వామి రాజుకు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి కార్యాలయాలలో కంప్యూటర్ మానిటర్స్ సరిగ్గా లేవని, ప్రింటర్లు స్కానర్స్ తోపాటు స్పేర్ పార్ట్స్ కొరత వలన క్లరికల్ ఇబ్బంది పడుతూ సరైన సమయంలో కార్మికులకు సేవలు అందించలేక పోతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కంప్యూటర్లు పెట్టుకోవడానికి కూర్చోవడానికి సరియైన ఫర్నిచర్ లేకపోవడం వలన సరి అయిన స్థితిలో కూర్చోలేక పలు రకాల ఇబ్బందులతో నడుము నొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. ఫైల్స్ భద్రపరుచుకోవడానికి కూడా సరైన అల్మారాలు లేవని, పేపర్ బెండల్స్, స్టేషనరీ కూడా సరిగ్గా అందుబాటులో ఉండటం లేదని పాతకాలం నాటి డీఓపీ కొనసాగిస్తుండటంతో ఆఫీసు నిర్వహణకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అనుకూలంగా స్టేషనరీ కొరకు డీఓపీని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఏరియా వ్యాప్తంగా అన్ని గనులలో, డిపార్మెంట్‌లకు వినతి పత్రాలు ఇచ్చి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు అశోక్, కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, మూర్తి, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు

ప్రశాంతంగా మొదటి రోజు ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా మొదటి సంవత్సరం భాషా పరీక్షలు ముగిసాయి. జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్ సుమన్ జిల్లాలోని పలు సెంటర్లను సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్ 4539, ఒకేషనల్ 807 మొత్తం 5346 మంది విద్యార్థులకు గాను జనరల్ 4304, ఒకేషనల్ 698 మంది హాజరయ్యారని మొత్తం 344 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులను ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లో అనుమతించగా 9 గంటలకు పరీక్ష ప్రారంభమైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని కేంద్రాలలో వైద్య సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు సాఫీగా సాగాయన్నారు. పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించడానికి డీఈసీ బృందం, 1 ఫ్లయింగ్ స్క్వాడ్ త్రిసభ్య బృందం, నల్గురు సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించినట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా జిల్లా స్థాయిలో డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారని, హాల్ టికెట్ తదితర సమస్యలుంటే కంట్రోల్ రూం 08733-293713 నెంబర్‌కి కాల్ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పరిశీలనలో డీఈసీ కమిటీ సభ్యులు శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో 5 కళాశాలకు సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 261 మంది విద్యార్థులకు గాను 248 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే నేడు జరిగే ద్వితీయ సంవత్సరం పరీక్షకు విద్యార్థులందరు సకాలంలో హాజరుకావాలన్నారు.

కౌటాల : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులు 254 మందికి గాను 231 మంది హాజరై 23 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 144 మందికి గాను 132 మంది హాజరై 12 మంది గైర్హాజరైనట్లు సెంటర్ సీఎస్ స్వరూప తెలిపారు. పరీక్షలకు వచ్చే విద్యార్థులు అరగంట ముందు సెంటర్‌కు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైన అనుమతించేదిలేదని ఆమె తెలిపారు.

హమాలీ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలి కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా డబులు బెడ్ రూమ్ ఇండ్లు, భూమి లేని పేదలకు 5ఎకరాలు భూమి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్‌లోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లై హమాలి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా గత 30 సంవత్సరాల నుండి చాలిచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు నిత్యావసర వస్తువులు అందించడంలో హమాలీలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నేటి వరకు హమాలి కార్మికులకు సొంత ఇండ్లు లేవని, కిరాయి ఇంట్లో ఉంటూ నెల నెలా కిరాయి కట్టలేక అనేక ఆర్థిక ఇబ్బందులు గురిఅవుతున్నారని అన్నారు. ముఖ్యంగా కరోన సమయంలో హమాలి కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారన్నారు. ఈపీఎఫ్ లెక్కలు సరి చెయ్యాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సొంత గోడౌన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. 20లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి సుధాకర్, నాయకులు శ్రీనివాస్, మోహన్, ప్రకాష్, తుకారాం పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 16 మార్చి 2023

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామ ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం కప్పర్ల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న విలాస్‌గౌడ్ పెన్నులు, ప్యాడ్లు అందజేసి ఉదారత చాటుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ గెడం గంగాధర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులకు అవసరమైన పెన్నులు, ప్యాడ్లు అందించడం అభినందనీయమన్నారు. గ్రామం, పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నైతం సుమలత, పాఠశాల సిబ్బంది లక్ష్మీకాంత్, అశోక్, యూత్ సభ్యులు ఉన్నారు.

జోడోయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిరికొండ




బోథ్ నియోజకవర్గం నేటి నుంచి కొనసాగే జోడోయాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం నుంచి జోడోయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. ఈ పాదయాత్రను మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమూద్, నాయకులు పసుల చంటి, కుమ్ర కోటేశ్వర్, రంజాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, సమయానుకూలంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో స్థానిక తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పరీక్షా కేంద్రంలోని పలు గదులను డీఐఈఓ, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌లతో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరుగకుండా నిర్వహించాలని, విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప కేంద్రంలోకి పంపించాలని అన్నారు. అనుమతి లేని పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించ కూడదని అన్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ రాయడానికి 10,819 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9,366 మంది హాజరయ్యారనీ, 1453 మంది హాజరు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సి.రవీందర్ కుమార్, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఐలయ్య పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో...

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చీఫ్ సూపరింటెండెంట్ కందూరి శంకర్ అన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై గంగాధర్, తహసీల్దార్ కరీంలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ విధించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరు గుంపులు గుంపులుగా తిరగరాదని పోలీసులు హెచ్చరించారు. ఈ పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, హిందీ పరీక్షలకు 249 విద్యార్థులు హాజరు కాగా,15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షకు 32 మంది విద్యార్థులు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. మొదటి రోజు మొత్తం 18 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. గురువారం నాటి ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో తెలుగు, హిందీ పరీక్షలకు 274 మంది, వొకేషనల్ విభాగంలో జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షకు 39 మంది విద్యార్థులు హజరు కానున్నట్టు ఆ శాఖాధికారి శ్రీకాంత్ తెలియజేశారు.



ఆదిలాబాద్‌టౌన్‌లో...

ఇంద్రవెల్లి : ఇంటర్మీడియట్ మొదటి రోజు పరీక్షలో క్రిసెంట్ ప్రయివేట్ జూనియర్ కళాశాలలో ఐదుగురు అభ్యర్థులు గైర్హాజరు కాగా, పరీక్షల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 336 విద్యార్థులకు గాను, 223 మంది హాజరుకాగా, 110 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాథోడ్ శ్రావణ నాయక్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బలరాం నాయక్ తనిఖీ చేశారు.

నార్నూర్ : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మొదటి సంవత్సరం పరీక్షలో 293 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, మొదటి పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం జరిగే ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షకు మొత్తం 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

దిలావర్‌పూర్ : ఆత్మ విశ్వాసంతో విద్యార్థులు పరీక్షలు రాయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు నిర్ణయించేది ఇంటర్ పరీక్షలేనని ఆయన వెల్లడించారు. బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ధృఢసంకల్పంతో రాయాలని, పరీక్షలకు సకాలంలో హాజరుకావాలని అన్నారు. భయం, ఒత్తిడి లేకుండా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైతాంగ సమితికి సాయన్న రాజీనామా

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రైతాంగ సమితికి సంబంధించిన అన్ని బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత కాలం ప్రజాసేవ చేశానని, ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సేవను ముగించి ఇక నుంచి పూర్తి సమయాన్ని కుటుంబానికి కేటాయించనున్నట్లు తెలిపారు.

గుడిసెలు తొలగించే కుట్రలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పట్టణ సమీపంలోని సర్వే నెం 72లో ఆదివాసులు వేసుకున్న గుడిసెలను కొన్ని రాజకీయ పార్టీల నాయకులు తొలగించే కుట్రలు చేస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ అన్నారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు బుధవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కొంత మంది రాజకీయ పార్టీల నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు కలిసి ఆదివాసుల గుడిసెలు తొలగించే కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుట్రలను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఖండించాలని కోరారు. కుమురంభీమ్ గూడలో నివాసముంటున్న ఆదివాసులకు పట్టాలు ఇవ్వాలని, తాగునీరు, కరెంటు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉయిక సంజీవ్, కుంర శ్యాంరావు, కుర్సెంగ తానాజీ, గోడం రేణుక, కుమురం సూరు యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సోయం రాందాస్, జిల్లా కార్యదర్శి ఉయిక ఇందిరా, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సిడాం నాగుబాయి పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు ముందు బీజేపీ నాయకుల అరెస్ట్



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పర్యటన దృష్టితో బుధవారం బీజేపీ నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలను నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో బీజేపీ నాయకులు నిరసన తెలిపే అవకాశమున్నందున పోలీసులు వారిని ముందే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ మండల అధ్యక్షులు చల్ల విశ్వంబర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌గౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డేగ నగేష్‌పటేల్, మండల ఉపాధ్యక్షులు బల్ల వెంకటేష్, పోచన్న, మద్ది సాయినాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దండేపల్లి : మంత్రి హరీష్‌రావు జిల్లా పర్యట నేపథ్యంలో బిజెపి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంత్రి పర్యటనను అడ్డుకుంటారని నిఘా వర్గాల సమాచారం మేరకు మండలానికి చెందిన బిజెపి కార్యకర్తలు కొండ నరేష్, ముష్కే కార్తీక్, ముతే వెంకటేష్, అనిల్, చేపిరిషెట్టి శ్రీనివాస్, బొర్లకుంట వెంకటేష్, వనపర్తి రాకేశ్, వంశీని అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

17న రాజీవ్ స్వగృహ ప్లాట్ల బహిరంగ వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

17న జరుగనున్న రాజీవ్ స్వగృహ ప్లాట్ల బహిరంగ వేలం పాటలో ఆసక్తిగల వారు అధిక సంఖ్యలో పాల్గొని, ఎలాంటి చిక్కులు లేని ప్లాట్ లను సొంతం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేల విలువగల డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ పేరున తీసి, నిర్ణీత దరఖాస్తు ఫారంతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయాలని తెలిపారు. గతంలో రాజీవ్ స్వగృహ ఇండ్ల మంజూరు కోసం చెల్లించిన రూ.3వేలు ఒరిజినల్ రశీదుతో దరఖాస్తు చేసుకోవచ్చుని, అట్టి డబ్బు తిరిగి వాపసు తీసుకున్నవారు కూడా రూ.3వేలు విలువగల డీడీ చెల్లించి, వేలం పాటలో పాల్గొనవచ్చుని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు దరఖాస్తు ఫారాలను



గురువారంలోగా అందజేయాలని, దరఖాస్తులు అందజేయని వారిని వేలం పాటలో పాల్గొనేందుకు అనుమతించబోమని ఆయన తెలిపారు. అగ్రజ టౌన్ షిప్‌లోని రాజీవ్ స్వగృహ ప్లాట్లను గత నవంబర్ మాసంలో 362 ప్లాట్లకు బహిరంగ వేలం వేయడం జరిగిందని తెలిపారు. పలు కారణాల వలన 58 ప్లాట్లకు డబ్బులు చెల్లించని కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి ఈనెల 17న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బహిరంగ వేలం పాటను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లే అవుట్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు అంతర్గత బీటీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మరో రూ.7 కోట్లతో తాగునీరు, విద్యుత్ సరఫరా, మురికి కాలువలు, తదితర పనులను చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల కార్యాలయానికి ప్రతి పాదనలు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలో అట్టి రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చే అవకాశం ఉందని సూచన ప్రాయంగా తెలిపారు. ఈ బహిరంగ వేలం పాటలో ఆసక్తి గల వారు పాల్గొని సొంతింటి ప్లాటును సొంతం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వర్తించొచ్చు

నవతెలంగాణ-నిర్మల్

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చునని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయ ఆవరణలో కేర్ హాస్పిటల్ బంజార హిల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోక పోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని, సిబ్బంది వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తిగా భిన్నంగా ఉంటుందని అన్నారు. ఇందుకుగానూ మన ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకొనక తప్పదని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ వంటివి మన దినచర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదని అన్నారు. మనం తీసుకునే అన్ని రకాల ఆహార పదార్థాలలో కల్తీ ఉంటుందని, జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. కొన్ని వ్యాధులకు గతంలో వైద్యం అందుబాటులో ఉండేది కాదని, ప్రస్తుత సమాజంలో ఎంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రత్యేకంగా మనకు అందుబాటులో గల ఆరోగ్య భద్రత



సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారైనా మన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించాలన్నారు. అనంతరం సిబ్బందికి వైద్య సిబ్బంది, పోలీసు అధికార, సిబ్బందికి కార్డియాలజి, ఆర్థోపెడిక్, బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఈకో, బీఎండీ ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్ కుమార్, సాయినాథ్, నారాయణరావు, సుజల, సాయి, ఏఆర్ అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఎస్బీఐ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ సీసీ వెంకట రమణ, సీఐలు, ఎస్సైలు, హోంగార్డులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్, ఏఐటీయూసీని చిత్తుగా ఓడించాలి

నవతెలంగాణ-నస్పూర్

చీకటి ఒప్పందాలు చేసుకొని హామీలను విస్మరించిన టీబీజీకేఎస్, ఏఐటీయూసీని చిత్తుగా ఓడించాలని వేజ్‌బోర్డ్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కార్మికులను కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో ఫిట్ కార్యదర్శి ముధాం వినోద్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 1998 నుండి 2018 వరకు ఏడు పర్యాయాలు సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగగా మూడు పర్యాయాలు ఏఐటియూసి సంఘానికి కార్మికులు గుర్తింపు హోదా కల్పిస్తే గోల్డెన్ షేక్ హ్యాండ్ పేరుతో యాజమాన్యం 30 వేల మంది కార్మికులను నిర్దాక్షిణంగా సంస్థ నుండి వెళ్లగొట్టడం జరిగిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న ఏఐటీయూసీ కార్మికుల పక్షాన పోరాటాలు చేయకుండా, యాజమాన్యం పక్షాన ఉండి కార్మికులకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కొత్త బావులు, మైనింగ్ యూనివర్సిటీ, హాస్పిటల్‌లను కార్పొరేట్ ఆసుపత్రిలాగా ఆధునీకరించడం, మారుపేరులను క్రమబద్ధీకరించడం, ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణ, ఓపెన్ కాస్ట్ రద్దు, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం లాంటి అనేక హామీలు ఇచ్చిన టీబీజీకేఎస్ వాటిని అమలు చేయకుండా కేవలం



నాయకులు పైరవీలు చేసుకుంటూ కోట్లాది రూపాయలు సంపాదించి తిరిగి వచ్చే ఎన్నికల్లో డబ్బులు వెదజల్లే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారావు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వి అనిల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎస్‌కె వలీ, అశోక్ లక్ష్మణ్, తన్వీర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సిసి రోడ్లు నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మిరవల్లి రాజకుమార్ అన్నారు. బుధవారం కమిషనర్ తన్నీరు రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీవాసులు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బురదలో ద్విచక్ర వాహనంపై వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అంతేకాకుండా నాగర్జున కాలనీలో రోడ్లను మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన



కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సందీప్, అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు వెంకటేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితబంధుపై సమావేశంలో రగడ



నవతెలంగాణ-తలమడుగు

దళితబంధు లబ్దిదారులను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం అధ్యక్షురాలు కళ్యాణం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. కజ్జర్ల సర్పంచ్ వెంకటమ్మ, తలమడుగు సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ దళితబంధు పొందిన దళితులను సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నామమాత్రంగానే వస్తోందన్నారు. ప్రతి సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ శాఖల పని తీరుతో గ్రామాల్లో పనులు జరగక ప్రజలు సర్పంచులను ప్రశ్నిస్తున్నారన్నారు. భగీరథతో పాటు పశు వైద్యం, వ్యవసాయం తదితర శాఖల అధికారులు తమ పనితీరు మార్చుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు దివ్య, ఎంపీటీసీలు చంటి, గౌరమ్మ, గోదావరి, హనుమంతు, సర్పంచులు పోతారెడ్డి, ఆనంద్, రమేష్‌రెడ్డి, మహేందర్ యాదవ్, పొచ్చుబాయి, గోవింద్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్, పశువైద్యాధికారి దూద్‌రామ్, మండల విద్యాధికారి నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంద్రవెల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ముకాడే ఉత్తం నియమితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముకాడే ఉత్తం మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ

చెరువులో పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని సిరిచెల్మ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ఉన్న చెరువులో పడి వృద్ధుడు లోఖండే బాబారావు(87) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నార్నూర్ మండల కేంద్రానికి చెందిన లోఖండే బాబారావు నార్నూర్‌లోని తన ఇంటి నుండి ఇస్త్రీ బట్టలు కోసమని మంగళవారం ఉదయం బయటకువెళ్లాడు. సాయంత్రం వరకు కూడ ఇంటికి తిరిగి రాలేకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకడంతో మొదలు పెట్టారు. ఎక్కడ కనిపించలేదు. బుధవారం మధ్యాహ్నం సిరిచెల్మ గ్రామస్తులు చెరువులో మృతి దేహం నీటిపై వేలాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందించారు, వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. జేబులో ఉన్న ఐడీ ప్రూఫ్ ఆధారంగా నార్నూర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధుడిగా గుర్తించి, వారి గ్రామసర్పంచ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు.

రేషన్‌షాప్‌ల ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని గొల్లపేట, మంజులాపూర్‌లోని రేషన్‌షాపులను బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాపుల ద్వారా సకాలంలో బియ్యం ఇతర వస్తువులను పంపిణీ చేయాలని, ఎప్పటికప్పుడు సంబంధిత వివరాలు రికార్డు చేయాలని ఆదేశించారు. అనంతరం చించోలి-బిలో గల మండల స్థాయి గిడ్డంగిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. గిడ్డంగిలో బియ్యం నిల్వలను సక్రమంగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ తనూజా, మేనేజర్ శ్రీకళ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

నూతన కలెక్టరేట్ సమీకృత భవన సమీపంలో గల ఈవీఎం గోదాంను బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈసీఐఎల్ ఆదేశాల మేరకు పాత స్టాక్ 600 బస్ బ్యాలెట్ యూనిట్స్‌లను పంజాబ్‌కు పంపించామని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ స్రవంతి, తహసీల్దార్ ప్రభాకర్, సూపరింటెండెంట్ అనిరుద్, వివిధ పార్టీల నాయకులు రమేష్, అజీమ్, మజర్, సయ్యద్ హైదర్ ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని శాంతినగర్ జూనియర్ కళాశాలతో పాటు పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తే ఊరుకోం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తే ఊరుకోబోమని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను బయట తిరగబోనివ్వమని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి మహేందర్ హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై మండిపడుతూ బుధవారం పట్టణంలోని వినాయక్ చౌక్‌లో ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేవైఎం నాయకులు, పోలీసులకు మధ్య కొంత తోపులాట జరిగింది. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో బీఆర్ఎస్ గద్దెనెక్కి అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పైరవీలకు పాల్పడుతూ సొంత కార్యకర్తలకే పోస్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. లక్షల రూపాయలు అప్పుచేసి శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకుల వ్యవహారంపై ప్రశ్నించిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలుపాలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఉన్నారు.